క్లుప్తంగా

ఉపముఖ్యమంత్రిని కలిసిన గిరిధర్‌రెడ్డి



భట్టి విక్రమార్కను సన్మానిస్తున్న గిరిధర్‌రెడ్డి

జహీరాబాద్: రాష్ట్ర ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ చైర్మన్ పదవిని కేటాయించినందుకు గాను కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి ఉన్నారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.

రేపటి నుంచి ఆలయ పున:ప్రతిష్ఠాపన వేడుకలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న స్వాములు

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి పట్టణంలోని ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయం పునః ప్రతిష్ఠాపన వేడుకలను ఈ నెల 24 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్రీశైలం గురుస్వామి తెలిపారు. ఈ మేరకు ఆలయ పున:ప్రతిష్ఠాపన వేడుకల సందర్భంగా శుక్రవారం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌గౌడ్, కోశాధికారి ప్రేమ్‌సాగర్, కార్యనిర్వాహక కార్యదర్శి అరుణ్, సభ్యులు ప్రసాద్, వీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆటపాటలతో విద్య నేర్పించాలి

సంగారెడ్డి టౌన్: పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యను అందించాలని మహిళా శిశు సంక్షేమశాఖ ఆర్జెడి మోతి అన్నారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ ఆడిటోరియంలో పూర్వవిద్యపై అంగన్‌వాడీ ఉపాధ్యాయులకు శిక్షణలో భాగంగా శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్జెడీ మోతి మాట్లాడుతూ ఐదేళ్లగా పిల్లలకు ఆటపాటలతో విద్య నేర్పించాలని సూచించారు. సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి లలితకుమారి తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య రాకుండా చూడండి

హత్నూర(సంగారెడ్డి): గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చర్యలు చేపట్టాలని గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో శంకర్ ఆదేశించారు. ఎంపీడీవో కార్యాలయంలో నీటి సమస్యపైన పంచాయతీ కార్యదర్శులతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వేసవి సమీపిస్తుండటంతో నీటి సమస్య రాకుండా అవసరమైతే ట్యాంకర్ల ద్వారా ప్రజలకు నీటిని సరఫరా చేయాలని సూచించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్, ఎంపీఓ సువర్ణ పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఏడుగురు వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సీఐ శ్రవణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బుధ, గురువారాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులను శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా, జడ్జి ఒక్కొక్కరికి రూ.1000 జరిమానా విధించినట్లు తెలిపారు.

100శాతం పన్నులు వసూలు చేయాలి

కంది(సంగారెడ్డి): గ్రామాల్లో ఆస్తిపన్ను వసూలు ఈ నెల 25లోగా పూర్తి చేసేందుకు పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఎంపీఓ మహేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మామిడిపల్లి, కవలంపేట, వడ్డేనగూడ తండాల్లో శుక్రవారం ఆస్తిపన్ను వసూలును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పన్ను వసూలు ఇప్పటివరకు 84 శాతం పూర్తయిందని మిగతా 16 శాతంను కూడా త్వరలోనే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పాదయాత్ర

జిన్నారం(పటాన్‌చెరు): అయోధ్య రామమందిర యాదిలో కార్యక్రమంలో భాగంగా హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం జిన్నారం నుంచి కొడకంచి గ్రామంలోని ఆదినారాయణస్వామి దేవాలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మపరిరక్షణ సమితి అధ్యక్షుడు ఆనంద్‌చారి, ధర్మపరిరక్షణ సమితి నాయకులు రవి, శ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డి, బ్రహ్మేందర్, నర్సింహారెడ్డి, పల్నాటి భాస్కర్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తోటకూర సాగు.. లాభాలు బాగు

- అందుబాటులో హైబ్రిడ్ విత్తనాలు
- తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు
- తోటకూర సాగుపై రైతుల ఆసక్తి



జహీరాబాద్ ప్రాంతంలో సాగు చేస్తున్న తోటకూర పంట

ఏ ప్రాంతం వారైనా అత్యధిక పోషక విలువలు కలిగిన తోటకూరను తప్పనిసరిగా వినియోగిస్తారు. మాంసకృత్తులు, లవణాలు, కాల్షియం, ఇనుము, విటమిన్ ఏ,సీ అధికంగా ఉంటాయి.. రైతులు పండించే ఆకు కూరల్లో ముఖ్యమైంది తోటకూర. ఈ పంటను వేసవి, వర్షకాలంలో ఎక్కువగా పండిస్తారు. వాణిజ్య పద్ధతిలో సాగు చేయడానికి అనేక హైబ్రీడ్ రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. ఎప్పుడూ డిమాండ్ ఉండే తోట కూరను జహీరాబాద్‌తో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో రైతులు ఎక్కువగా సాగు చేస్తున్నారు. తోట కూరసాగు, విత్తనాలు, విత్తే విధానం, కలుపు నివారణ, ఎరువుల వాడకం తదితర విషయాలను జహీరాబాద్ ఉద్యాన వన శాఖ అధికారిణి శైలజ వివరించారు.

– జహీరాబాద్ టౌన్

తోటకూరలో రకాలు

తోటకూరలో ఆర్ఎస్ ఏ-1, కో-1, కో-2, కో-3, కో-4, కో-5, పూసా చోటీ చౌలై, పూసాబడి చౌలై, పూసా కీర్తి, పూసా కిరణ్, పూసాలాల్ చౌలై, అర్క సుగుణ, అర్క అరుణ(ఎర్ర తోటకూర) రకాలు సాగుకు అనుకూలంగా ఉంటాయి. విత్తనం నాటిన 25 రోజులకు మొదటిసారిగా తరువాత ప్రతి వారం నుంచి 10 రోజులకు ఒక కోత వస్తుంది. 90 రోజుల్లో ఎకరాకు 4 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. మొక్కలను వేర్లతో సహా పీకి కట్టలుగా కడితే ఎకరాకు 3 టన్నుల వరకు దిగుబడి వస్తుంది.

విత్తనం నాటే విధానం

తోటకూర సాగుకు ఇసుక కూడిన గరప నేలలు అనుకూలం. నీరు నిలిచే బంకమట్టి ఇసుక నేలలు పనికిరావు. నేలను 4-5 సార్లు బాగా దున్నాలి. ఎకరాకి 10 టన్నుల పశువుల ఎరువు వేసి మడులను బాగా చదును చేసుకోవాలి. సన్నటి ఇసుకతో విత్తనాలు కలిపి మడులల్లో వెదజల్లాలి. ఎకరాకు 800 గ్రాముల విత్తనం అవసరమవుతుంది. నారు పెంచి మొక్కల్ని కూడా 20 సెంటీ మీటర్ల దూరంలో నాటుకోవాలి. విత్తనం నాటిన ఒకటి రెండు రోజుల్లో ఒకటిన్నర లీటర్ల డ్యుయల్ మందులో 200 లీటర్ల నీటిని కలిపి పిచికారి చేయాలి. ఇలా చేస్తే కలుపును నివారించవచ్చు. ఆఖరి దుక్కిలో పశువుల ఎరువుతో పాటు ఎకరాకు 20 కిలోల నత్రజని, 20 కిలోల భాస్వరం, 12 కిలోల పోటాష్ ఇచ్చే ఎరువులను వేసి కలియ దున్నాలి.

తెగులు నివారణ

తోటకూరకు తెల్లమచ్చ తెగులు, ఆకులను తినే గొంగళి పురుగుల బెడద ఉంటుంది. తెల్లమచ్చ తెగులు ఆశిస్తే ఆకుల అడుభాగాన తెల్లని బుడిపెలు ఏర్పడుతాయి. పై భాగాన పుసుపు రంగు మచ్చలు ఏర్పడి క్రమేపి పండుబారి ఆకులు ఎండిపోతాయి. తెల్లమచ్చల తెగుల నివాణకుగాను 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా 2.5 గ్రాముల మాంకోజెబ్ లేదా క్లోరోథలోనిల్ లీటరు నీటికి చొప్పున కలపి పిచికారి చేస్తే తెగులను అదుపుచేయవచ్చు. గొంగళి పురుగుల నివారణకు 2 మిల్లీలీటర్ల మాలథిన్ లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి. ఆకుకూరలకు సాధ్యమైనంతవరకు వేప సంబంధ మందుల తోనే సస్యరక్షణకు యత్నించాలి. తప్పని పరిస్థితిలో తక్కువ విషపూరితమైన మందులను వినియోగించాలి. మందు చల్లే ముందు ఆకులను ఎప్పటికప్పుడు కోసుకోవాలి. మందు చల్లాక వారం వరకు ఆకులను కోయరాదు.

> **ఏడాది పొడువునా ఆదాయం పొందవచ్చు**
>
> 
>
> తోటకూర ఎలాంటి వాతావరణ పరిస్థితుల్లో నైనా సాగు చేయవచ్చు. తక్కువ ఉష్ణోగ్రతలో మొక్కల్లో పెరుగదల సరిగా ఉండదు. బంక, ఇసుక నేలలు తప్పా మిగతా నేలల్లో ఈ పంట సాగుకు అనుకూలం. లోతుగా దుక్కిదున్ని ఆఖరి దుక్కిలో పశువుల ఎరువు వేయాలి. మేలైన విత్తనాలను ఎంచుకోవాలి. యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడి వస్తుంది. తోటకూర సాగు ద్వారా ఏడాది పొడువునా ఆదాయం పొందవచ్చు.
>
> – శైలజ, ఆర్టికల్చర్ అధికారిణి, జహీరాబాద్

ఆన్‌లైన్ తప్పిదంతో తిప్పలు

- మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని అధికారుల సూచన
- అయోమయంలో లబ్ధిదారులు



ప్రత్యేక కౌంటర్ వద్ద దరఖాస్తు చేసుకుంటున్న లబ్ధిదారులు

జహీరాబాద్ టౌన్: ఎన్నికల హామీలో భాగంగా ప్రభుత్వం గృహజ్యోతి పథకం కింద జీరో విద్యుత్ బిల్లు జారీ ప్రక్రియను ప్రారంభించిన విషయం తెలిసిందే.. దీంతో ఈ నెల 1 తేదీ నుంచి విద్యుత్ సిబ్బంది ఇంటింటికి వెళ్లి బిల్లింగ్ తీశారు. అయితే వివిధ కారణాలతో అర్హులైన వారికి జీరో బిల్లు రాలేదు. ఆన్‌లైన్ తప్పిదం ద్వారా అర్హులకు అన్యాయం జరుగుతోంది. గృహజ్యోతి కింద ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న అర్హులకు 200 యూనిట్ల లోపు రీడింగ్ ఉంటే ఉచిత విద్యుత్ అమలు చేయాలనేది ఈ పథకం ఉద్దేశం. ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్న వారిపేర్లను జనవరిలోనే ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. డేటా ఆపరేటర్లకు సమయం తక్కువగా ఇవ్వడంతో వివరాలను హడావుడిగా ఆన్‌లైన్ ఎక్కించారు. దీంతో చాలామంది వివరాలు కనిపించలేదు. కొంతమందికి నాట్ అప్లై అని చూపిస్తోంది. జహీరాబాద్ నియోజకవర్గంవ్యాప్తంగా చాలామంది అర్హులు ఉన్నవారికి ఉచిత విద్యుత్ అమలు కావడంలేదు. తమకు అన్యాయం జరిగిందని గ్రామాల్లో ఎంపీడీఓ, పట్టణంలో మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నా ఆన్‌లైన్‌లో కనిపించనివారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తున్నారు. దీంతో మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ వద్ద దరఖాస్తుదారుల సందడి నెలకొంది.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న విజయలక్ష్మి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ప్రతిఒక్కరూ పోషణతో కూడిన ఆహారం తీసుకోవాలని నందికంది అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి అన్నారు. పోషణ మాసంలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని నందికంది అంగన్‌వాడీ కేంద్రంలో పోషకవిలువలపై అవగాహన కల్పించారు. పండ్లు, ఆకుకూరలు వంటివి తీసుకోవడం ద్వారా సంపూర్ణం ఆరోగ్యం పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో ఉద్యోగాలు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

సంగారెడ్డి అర్బన్: ఐటీఐ కోర్స్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు స్థానిక పరిశ్రమల్లో అప్రెంటిస్, ఉద్యోగాలు కల్పించాలని, పెరిగిన ధరల కనుగుణంగా విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ ఫీజు రియంబర్స్‌మెంట్ పెంచాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎస్ఎఫ్ఐ సంగారెడ్డి డివిజన్ మహాసభను పట్టణంలోని గవర్నమెంట్ ఐటీఐ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీఐ కళాశాలకు ప్రత్యేక హాస్టల్ ఏర్పాటు చేయాలని తీర్మానించినట్లు తెలిపారు. అనంతరం ఎస్ఎఫ్ఐ సంగారెడ్డి డివిజన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులుగా శ్రీనివాస్, రవికిరణ్ గౌడ్, ఉపాధ్యక్షుడిగా తుకారం, కార్తిక్, సహాయ కార్యదర్శిగా విక్టోరియా, సభ్యులుగా సప్న, మనీలా, లక్ష్మి, శ్రీకాంత్, ప్రశాంత్, రజనీకాంత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గర్ల్స్ కన్వీనర్ వాణి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సేవాభావం ఉండాలి

నారాయణఖేడ్: ప్రతిఒక్కరికి సేవాభావం ఉండాలని ఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి అన్నారు. ఖేడ్ ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రైవేట్ ఆస్పత్రులు సౌజన్యంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవిలో ప్రజలు, ప్రయాణికుల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం మల్లేశయ్య, ఆర్టీసీ మార్కెటింగ్ సెల్ ఇన్‌చార్జి పాండు, ఆస్పత్రుల సిబ్బంది పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్స్ పెంచాలి

నారాయణఖేడ్: పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థుల స్కాలర్‌షిప్, రీయింబర్స్‌మెంట్ పెంచాలని ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ అధ్యక్షుడు అతిమేల మాణిక్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ నారాయణఖేడ్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు-సవాళ్లు అనే అంశంపై వెంకటేశ్వర ఐటీఐ కళాశాలలో సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాణిక్యం మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలన్నారు. ఖేడ్ నియోజకవర్గంలో పరిశ్రమలు స్థాపించాలని నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సతీష్, నాయకులు చంద్రకాంత్, బాలాజీ, చంద్రశేఖర్, అనిల్ పాల్గొన్నారు.

మల్లు రవికి సన్మానం



మల్లు రవిని సన్మానిస్తున్న నాయకులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): నాగర్ కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా మల్లు రవి పేరును ప్రకటించడంతో స్థానిక నేతలు శుక్రవారం మల్లు రవిని కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు రాజుకోటి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

బయోచార్ వినియోగంపై అవగాహన

రాయికోడ్(అందోల్): భూసారాన్ని కాపాడుకోవడంపై రైతులు దృష్టి సారించాలని కోర్ కార్బన్ ఎక్స్ సొల్యూషన్ ప్రవేట్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ కార్తిక్ రావు రైతులకు సూచించారు. మండలంలోని ఖాంజమాల్‌పూర్ గ్రామంలో పంట వ్యర్థాల నుంచి బయోచార్ (బొగ్గు) తయారు చేసుకునే విధానంపై రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయనాల వినియోగంతో తగ్గిన భూసారాన్ని బయోచార్‌ను మట్టిలో కలిపి పెంచుకోవచ్చన్నారు. మొక్కజొన్న, జొన్న చొప్పను బొగ్గుగా మార్చి పొడి చేసుకుని వ్యవసాయ పొలంలో కలిపితే తక్కువ ఖర్చుతో భూసారాన్ని పెంచుకోవచ్చని సూచించారు. బయోచార్ వినియోగంతో రసాయన ఎరువుల వినియోగాన్ని క్రమంగా తగ్గించుకునే అవకాశం ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నరేష్, సంస్థ ప్రతినిధులు మహంతి, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు చేపట్టాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ, జ్యోతిలక్ష్మి

కొండాపూర్(సంగారెడ్డి): మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు చేపట్టాలని ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి అన్నారు. పంచాయతీ కార్యదర్శులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవికాలం ప్రారంభమైన నేపథ్యంలో నీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, నర్సరీలలో 100 శాతం మొక్కలు సర్వీవల్ ఉండేలా చూడాలన్నారు. ఈటీపీఆర్ఓ, ఏపీఓ వీరప్ప పాల్గొన్నారు.

22 లీటర్ల మద్యం స్వాధీనం

పటాన్‌చెరు టౌన్: 22 లీటర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్‌పూర్ మండల పరిధిలోని ఐలాపూర్ తండాలో శివసాయికిరణ్ షాప్‌లో మోహన్ అనే వ్యక్తి గుట్టుచప్పుడు కాకుండా మద్యం విక్రయిస్తున్నాడు. దీంతో సమాచారం తెలుసుకున్న పోలీసులు షాపుపై దాడులు నిర్వహించి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని మోహన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తల్లి అదృశ్యంపై ఫిర్యాదు



పార్వతి

పటాన్‌చెరు టౌన్: తల్లి అదృశ్యంపై కుమారుడు ఫిర్యాదు చేశాడు. ఈ సంఘటన అమీన్‌పూర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని కృష్ణా బృందావన్ కాలనీకి చెందిన ఫణీంద్ర తల్లి శివపార్వతికి మానసిక స్థితి సరిగా లేకపోవడంతో వైద్యం చేయిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన శివపార్వతమ్మ తిరిగి రాలేదు. దీంతో కుమారుడు ఫణీంద్ర తల్లి కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ మేరకు తల్లి అదృశ్యంపై శుక్రవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో...

పటాన్‌చెరు టౌన్: కొడుకు, కోడలు అదృశ్యంపై తండ్రి ఫిర్యాదు చేశాడు. ఈ సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...రంగారెడ్డి జిల్లా గాజులరామారానికి చెందిన వంశీకృష్ణ, భార్య శ్రీలతతో కలిసి అమీన్‌పూర్ మండల పరిధిలోని ప్రైడ్ పార్క్‌లో నివాసం ఉంటున్నారు. వంశీకృష్ణ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. అయితే వంశీకృష్ణ తండ్రి కామేశ్వర్‌శర్మ గత ఫిబ్రవరి 2వ తేదీ నుంచి కొడుకు, కోడలుకు ఫోన్ చేయగా ఇరువురి ఫోన్‌లు స్విచ్ ఆఫ్ వచ్చాయి. ఈ క్రమంలో కామేశ్వరశర్మ కొడుకు, కోడలు నివాసం ఉంటున్న ఇంటికి వచ్చి శుక్రవారం చూడగా కోడలి అన్న మహేష్ ఉన్నాడు. కాగా కొడుకు, కోడలు ఎక్కడికి వెళ్లారని అడగడంతో ఉద్యోగం వెళ్లారని సమాధానం చెప్పాడు. దీంతో కామేశ్వర్‌శర్మ కొడుకు, కోడలి కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.



వంశీకృష్ణ, శ్రీలత

గాలికుంటు టీకాలు వేయించాలి

రాయికోడ్(అందోల్): పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు విధిగా వేయించాలని మండల పశువైద్యాధికారి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఇందూర్ గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి వ్యాప్తి, నివారణపై పోషకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 3వ తేదీ వరకు టీకాలు వేస్తామన్నారు. మండలంలోని రాయికోడ్, పాంపాడ్, సింగితం, తదితర గ్రామాల్లో గాలికుంటు టీకాలు వేసినట్లు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ ప్రజాపాలన దరఖాస్తుల అప్‌డేట్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రజాపాలన దరఖాస్తులను అప్‌డేట్ చేయించుకోనే వారికి ఏలాంటి ఇబ్బందులు లేకుండా తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయ ప్రాగంణంలో ప్రత్యేక కేంద్రాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. ప్రభుత్వం పథకాలకు దరఖాస్తులు చేసుకున్నవారు రూ.500 గ్యాస్, జీరో విద్యుత్ బిల్ కోసం వారి దరాఖాస్తులను అప్‌డేట్ చేయించుకుంటున్నారు. 10 రోజులగా 250 మంది దరఖాస్తులను అప్‌డేట్ చేయించుకున్నారని మున్సిపల్ అధికారులు తెలిపారు.

◆ పరిశ్రమ సందర్శన

జిన్నారం(పటాన్‌చెరు): గడ్డపోతారం పారిశ్రామిక వాడలోని స్టాండర్డ్ గ్లాస్ పరిశ్రమలో తగిన సేఫ్టీ పరికరాలు అందుబాటులో లేకపోవటంతో ఫాజిల్ అనే కార్మికుడు గాయపడ్డ విషయం తెలిసిందే. పరిశ్రమలో సేఫ్టీ కోసం యాజమాన్యం తీసుకుంటున్న చర్యలపై శుక్రవారం అధికారులు ఆరా తీశారు. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ యాజమాన్యంపై కేసు నమోదు చేశామని, పరిశ్రమలో ఉన్న సేఫ్టీ విషయమై ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.

◆ పథకాలను వినియోగించుకోవాలి

సంగారెడ్డి టౌన్: మాజీ సైనికులు స్వయం ఉపాధి పథకాలు వినియోగించుకోవాలని ప్రాంతీయ సైనిక సంక్షేమ అధికారి సత్యశ్రీ అన్నారు. శుక్రవారం జిల్లా కార్యాలయంలో మాజీ సైనికుల ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం ఉపాధి పథకాలు వినియోగించుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సైనిక సంక్షేమశాఖను పూర్తి డిజిటల్ చేయడం ద్వారా సైనికుల డేటాను కంప్యూటర్ రైజ్ చేసినట్లు తెలిపారు.

◆ ప్రైవేటు ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలి

నారాయణఖేడ్: ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా రోగుల నుంచి విచ్చలవిడిగా డబ్బులు వసూలు చేస్తున్న ప్రైవేటు ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నారాయణఖేడ్ డివిజన్ కార్యదర్శి ఆనంద్, నాయకులు చిరంజీవి డిమాండ్ చేశారు. ఆ పార్టీ డివిజన్ స్థాయి సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ల్యాబ్, బెడ్స్, గ్లూకోజ్ తదితరవాటికి సంబంధించిన చార్జీలను విపరీతంగా వేస్తూ రోగులను దోచుకుంటున్నారని మండిపడ్డారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రవేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు అశోక్, ఇసాక్, ప్రేమ్, దత్తు పాల్గొన్నారు.

◆ పందుల యజమానులకు నోటీసులు

నారాయణఖేడ్: ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని పందుల యజమానులకు కమిషనర్ జగ్జీవన్ శుక్రవారం నోటీసులు జారీ చేశారు. మున్సిపాలిటీ పరిధిలో పందులు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయని నోటీసులో పేర్కొన్నారు. పందుల వల్ల వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందునా వాటిని జనసంచారంలేని ప్రాంతాల్లో పెంచుకోవాలని సూచించారు. వారం రోజుల్లోగా వాటిని తరలించకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. నోటీసులను మున్సిపల్ శానిటరీ అధికారి శ్రీనివాస్ పందుల యజమానుల ఇళ్లకు వెళ్లి అందజేశారు.

◆ ట్రాఫిక్ డైవర్షన్ పరిశీలన

కంది(సంగారెడ్డి): జాతీయ రహదారిపై కంది చౌరస్తాలో చేపట్టనున్న ట్రాఫిక్ డైవర్షన్‌ను పోలీస్, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు శుక్రవారం పరిశీలించారు. గ్రామం మధ్యలో ఈచౌరస్తా ఉండడంతో దాటుతున్న క్రమంలో వాహనాలు అదుపు తప్పి తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికే ఎంతోమంది ప్రాణాలు పోగొట్టుకోగా చాలామంది తీవ్ర గాయాల పాలయ్యారు. ట్రాఫిక్ నియంత్రణ కోసం సిగ్నల్స్ ఏర్పాటు చేసినా పరిస్థితి మారలేదు. దీంతో ప్రస్తుతం ఉన్న చౌరస్తాను మూసివేసి ఎంపీపీ కార్యాలయం సమీపంలో కింగ్స్ దాబాతో పాటు మరోచోట జాతీయ రహదారిపై ఉన్న డివైడర్లను తొలిగించి దారిని ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ సీఐ సుమన్‌కుమార్, ఎంపీఓ మహేందర్‌రెడ్డి, కంది పంచాయతీ కార్యదర్శి విద్యాధర్‌గౌడ్ పాల్గొన్నారు.

◆ విజయవంతమైన మహా పాదయాత్ర

జహీరాబాద్ టౌన్: లోకకల్యార్థం ధనసిరి పీఠాధిపతి వీరేశ్వర శివాచార్యుల ఆధ్వర్యంలో చేపట్టిన మహా పాదయాత్ర శుక్రవారం రాత్రి శ్రీశైల క్షేత్రంకు విజయవంతంగా చేరుకుంది. శివాచార్యులు ప్రతి సంవత్సరం భక్తులతో కలిసి మహా శివరాత్రి తరువాత మహా పాదయాత్ర చేపడుతారు. ఈ సంవత్సరం 1200 మంది భక్తులతో కలిసి పది రోజుల క్రితం మహా పాదయాత్ర ప్రారంభించారు. 380 కిలో మీటర్ల వరకు కొనసాగిన మహా పాదయాత్ర ముగిసింది. శనివారం స్వామివారిని దర్శించుకుని తిరుగు ప్రయాణమవుతామని పాదయాత్రికుల బృందం సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు మల్‌శెట్టి, ధనసరి మాజీ సర్పంచ్ హబ్సిరాజు, ఎస్ఆర్ఐ రవి, జగన్నాథ్, ఎంపీటీసీ బాబు, మల్లికార్జున్‌రెడ్డి, అశోక్, దేవరాజ్, సంతోష్, విజయ్, నాగేష్, వీరేశ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

◆ మత్స్య సహకార సంఘం ఎన్నిక

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని రాళ్లకత్వ గ్రామంలో మత్స్య పారిశ్రామిక సహకార సంఘాన్ని శుక్రవారం ఎన్నిక చేశారు. సంఘం అధ్యక్షుడిగా ఆదినర్సింలు, ఉపాధ్యక్షుడిగా ఆది బాల్‌రాజ్, కార్యదర్శిగా కృష్ణ, డైరెక్టర్‌లుగా శ్రీనివాస్, రామస్వామి, శేఖర్, గోపాల్, యశోదలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం ఎన్నికైన వారికి నియామకపత్రాలను అందజేశారు.

రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి

సంగారెడ్డి అర్బన్: భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత పౌరులందరిపై ఉందని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పీ.అశోక్ అన్నారు. శుక్రవారం కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం సంగారెడ్డి జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. రాజ్యాంగం చట్టం ముందు మనుషులందరూ సమానమే అంటుందన్నారు. కానీ మనువాదులు భారత రాజ్యాంగాన్ని మార్చాలని కుట్రలు చేస్తున్నారని, రాజ్యాంగం స్థానంలో మనుశాస్త్రం తీసుకురావాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ప్రభుత్వాల విధానాలతో విద్యా, వైద్యం కార్పొరేట్ మయం అవుతున్నాయని, ఇది ఏ మాత్రం క్షేమం కాదని అన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.శివకుమార్, బీ.రాజు, సహాయ కార్యదర్శులు మల్లేశం, దాస్, జిల్లా కమిటీ సభ్యులు దత్తు, గంగారం, చరణ్, చంద్ర శేఖర్, తదితరులు పాల్గొన్నారు.